క్లుప్తంగా

ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుంది



అభినందిస్తున్న ఏసీపీ రమేశ్, సీఐ ప్రసాద్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ: విద్యార్థులు కరాటే నేర్చుకుంటే వారి ఆత్మ రక్షణకు ఎంతో దోహదపడుతుందని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ అన్నారు. జాతీయస్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులను మంగళవారం గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్‌రావుతో కలసి ఆయన అభినందించారు. ఈనెల 3న హైదరాబాద్‌లో మార్షల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో స్పందన స్కూల్‌కు చెందిన విద్యార్థులు వర్షిణి, కృతిక్ సాయి, ప్రశస్త శ్రీ, అక్షరన్, సుచిత్ర, శ్రీచైత్ర గోల్డ్ మెడల్, రుత్విక్ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఏసీపీ వారికి మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్స్ అందజేశారు. శిక్షణ ఇచ్చిన మాస్టర్ సంపత్‌ను అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ ఓదెలుయాదవ్, హెచ్‌ఎం రవీందర్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సూచనలు చేస్తున్న కమిషనర్ వెంకటేశ్

సుల్తానాబాద్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నిబంధనలు పాటించకుంటే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. నిత్యం రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తామన్నారు. చెరువు కట్ట నుంచి నిర్మిస్తున్న రోడ్డును ఏఈ సతీశ్‌తో కలిసి పరిశీలించారు. కౌన్సిలర్ నిషాద్ రఫీక్, మున్సిపల్ సిబ్బంది, కాలనీ ప్రజలు ఉన్నారు.

ఎన్టీపీసీ ఈడీకి సన్మానం



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండును మంగళవారం సన్మానించారు. ప్రాజెక్టు పరిపాలనా భవనంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ రామగుండం-తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కేదార్ రంజన్ పాండుకు ఇటీవల సదరన్ రీజియన్ హెడ్ క్వార్టర్ (ఎస్ఆర్‌హెచ్‌క్యూ) రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎన్టీపీసీ సంస్థ కార్పొరేట్ సెంటర్ నుంచి ఉత్తర్వులు విడుదలైన విషయం విదితమే. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఉద్యోగ గుర్తింపు సంఘం (ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్-ఐఎన్టీయూసీ అనుబంధం) వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, జనరల్ సెక్రటరీ ఆరెపల్లి రాజేశ్వర్ సన్మానించారు. ఏజీఎం హెచ్‌ఆర్ బిజయ్‌కుమార్ సిగ్దర్ పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మంథని: స్థానిక గురుకుల విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్ శ్రీనాథ్ మంగళవారం అభినందించారు. అండర్ -19 కబడ్డీ పోటీల్లో అభిరామ్, వరుణ్, కార్తీక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 ఖోఖో పోటీల్లో శివకిశోర్, శివచరణ్‌తేజ, అథ్లెటిక్స్‌లో సాత్విక్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ



రామగుండం: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కావేటి సాయి ఆరాధ్య ఎన్టీపీసీలోని మాతృమందిర్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచింది. పాఠశాల ఉపాధ్యాయులు ఆరాధ్యను అభినందించారు.



జ్యోతినగర్: పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



కమాన్‌పూర్‌లో..



ఫెర్టిలైజర్‌సిటీ: నాగేశ్వరస్వామి ఆలయంలో..

నాగుల చవితి వేడుకలు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/జూలపల్లి /కమాన్‌పూర్/ఫెర్టిలైజర్‌సిటీ/కాల్వశ్రీరాంపూర్/ఎలిగేడు /జ్యోతినగర్/ఓదెల/ముత్తారం: జిల్లావ్యాప్తంగా పెద్దపల్లితో పాటు మంథని, రామగుండం నియోజకవర్గాల్లో మంగళవారం నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించారు. నాగ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు.



కాల్వశ్రీరాంపూర్‌లో ప్రత్యేక పూజలు



సుల్తానాబాద్‌లో పూజలు చేస్తున్న భక్తులు

రామగిరి ఖిల్లా ఔషధ మొక్కలపై మరింత పరిశోధన చేస్తా

రామగిరి: మండలంలోని బేగంపేటలోని రామగిరి ఖిల్లా ఔషధ మొక్కలపై ప్రాథమిక పరిశోధన చేసిన పత్రాన్ని శాతవాహన విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహమూర్తి మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబుకు అందజేశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి పరిశోధన విషయాలను వివరించారు. రామగిరి ఖిల్లా కొండలపై విస్తరించి ఉన్న ఔషధ మొక్కలకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని సేకరించామని, పూర్తి సమాచారం సేకరించి మరింత పరిశోధన జరిపి సమగ్ర సమాచారం పుస్తక రూపంలో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రొఫెసర్ వెంట కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి ఆరెల్లి కిరణ్‌గౌడ్ ఉన్నారు.



మంత్రికి పరిశోధన పత్రం అందిస్తున్న ప్రొఫెసర్

గీత కార్మికుల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్తా



అన్నయ్యగౌడ్‌తో కొలనూర్ గౌడ సంఘం నాయకులు

సుల్తానాబాద్: గీత కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం ఓదెల మండలం కొలనూర్ గ్రామ గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కలిసి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శులు బైరి రవీందర్‌గౌడ్, ఎస్పీ రాజయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ మాటూరి రవి, గౌడ సంఘం నాయకులు ప్రెసిడెంటు తోట తిరుపతిగౌడ్, సిరిశెట్టి సారయ్యగౌడ్, తోట అనిల్‌గౌడ్, పూల సదయ్యగౌడ్, మరక శ్రీనివాస్‌గౌడ్, సదయ్యగౌడ్ పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలి

సుల్తానాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం సన్నవడ్లకే కాకుండా దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటలోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. సునీల్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతుల అకౌంట్లలో నగదు జమ చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు వేల్పుల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు శంకర్, శ్రీనివాస్, నాయకులు సదానందం, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్, రమేశ్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి

బీజేపీ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న నాయకులు

గోదావరిఖని: బీజేపీ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ మంగళవారం గోదావరిఖనిలో నిర్వహించారు. స్థానిక వీకేరెడ్డి, లక్ష్మీనగర్, తిరుమలనగర్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పార్లమెంట్ కోకన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య, అరుణ్‌కుమార్, నాయకులు రవీందర్, రామన్న, సాగర్, శివరామకృష్ణ, శంకర్, కమలాకర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చింపడం నీచమైన చర్య

పాలకుర్తి: బీఆర్‌ఎస్ నాయకుడు, బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు కౌశికహరికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కొంతమంది ఫ్లెక్సీలు చింపే నీచమైన చర్యలకు పాల్పడుతున్నారని కేశోరాం కాంట్రాక్ట్ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ ఆగ్రహించారు. పాలకుర్తి మండల ప్రజలకు, కేశోరాం కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద కాంట్రాక్ట్ కార్మికసంఘం నాయకులు ఇటీవల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాటిని చింపివేశారు. కార్మికసంఘం నాయకులు, కార్మికులు, కౌశికహరి మద్దతుదారులు చిరిగిన ఫ్లెక్సీల వద్ద నిరసన తెలిపారు. ఫ్లెక్సీలను చింపిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. సంబంధిత విషయమై బసంత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు పాలకుర్తి మాజీ ఉపసర్పంచ్ మాదాసు సతీశ్, నాయకులు సతీశ్, నాగరాజు, స్వామి, శ్రీనివాస్, చంద్రమోహన్, శంకర్, శ్రీనివాస్, సమ్మయ్య, గణేశ్, స్వామి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తాం

సుల్తానాబాద్: పెద్దపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా)కు అనుకూలంగా తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్‌చైర్మన్ బిరుదు సమత అన్నారు. పుడా కమిటీ సభ్యులు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించడంతోపాటు కమిటీ సభ్యులకు తీర్మానం కాపీ ఇస్తామని పేర్కొన్నారు. పుడా కమిటీ సభ్యులు బుసనవేణి రమేశ్‌గౌడ్, బొంకూరి సురేందర్ సన్ని, కావేటి రాజగోపాల్, మంద భాస్కర్‌యాదవ్, తూముల శ్రీనివాస్, బొడ్డుపల్లి రామ్మూర్తి, కల్లెపల్లి రవి, తాలపల్లి అంజయ్య, కల్లెపల్లి సతీశ్, అలువాల రాజేందర్, నీల సజయ్‌కుమార్ పాల్గొన్నారు. పుడా కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను సన్మానించారు.



వినతిపత్రం అందజేస్తున్న పుడా కమిటీ సభ్యులు

మళ్లీ టవర్ ఎక్కిన యువకుడు

పెద్దపల్లిరూరల్: మొన్న సుల్తానాబాద్‌లో టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన యువకుడు ఇంజాల రాకేశ్.. మంగళవారం పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని తన ఇంటి నుంచి గ్రామశివారులో గల టవర్ ఎక్కాడు. తనకు కొందరితో ప్రాణభయం ఉందని, తన సమస్యను ఎవరూ పరిష్కరించలేరని అంటున్న రాకేశ్‌కు కొద్ది రోజులుగా మానసికస్థితి సరిగ్గా లేదని స్థానికులు, పోలీసుల ద్వారా తెలిసింది. అయితే ఏసీపీ గజ్జి కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, బసంత్‌నగర్ ఎస్సై స్వామి, మాజీ సర్పంచ్ ఆడెపు వెంకటేశం, మాజీ ఎంపీటీసీ తోట శ్రీనివాస్ మాట్లాడినా రాకేశ్ ససేమిరా దిగలేదని స్థానికులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• బల్దియాకు కొత్త ట్రాక్టర్లు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థకు కొత్తగా ఐదు ట్రాక్టర్లను అధికారులు కొనుగోలు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సుమారు రూ.45.50లక్షలు వెచ్చించి ఐదు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. వాటికి రిజిస్ట్రేషన్, బీమా చేయించడానికి ఇంజినీరింగ్ విభాగం అధికారులు చర్యలు చేపడుతున్నారు. వీటిని శానిటేషన్ విభాగానికి కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. కొత్త ట్రాక్టర్లతో పారిశుధ్య సమస్య తీరనుంది.

• ఆరు గ్యారంటీల అమలులో విఫలం

గోదావరిఖని: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య ఆరోపించారు. స్థానిక శ్రామిక భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ భూపాల్, జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.ముత్యంరావు, ఎ.మహేశ్వరి, రమాచారి, వేల్పుల కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• రెండోరోజు కొనసాగిన రిలే నిరాహార దీక్ష

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కార్మికులకు మెరుగైన బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పర్మినెంట్ కార్మికసంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం రెండోరోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మాదాసు రాజేశం, బదావత్ రాజునాయక్, పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ గౌసియాబేగం దీక్షకు మద్దతు తెలిపారు. కార్మికులకు గతేడాది చెల్లించిన దానికంటే అదనంగా బోనస్ చెల్లించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. నాయకులు బయ్యపు జగన్‌మోహన్ రెడ్డి, దేవనందుల రాజమౌళి, కాదాసి తిరుపతి, యాదవ సంఘం నాయకులు మేకల నర్సయ్య, కాల్వ తిరుపతి పాల్గొన్నారు.

• వడ్కాపూర్‌లో పశువైద్య శిబిరం

జూలపల్లి: మండల పశువైద్యశాల ఆధ్వర్యంలో వడ్కాపూర్‌లో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడి పశువులకు ఉచిత చికిత్సతోపాటు నట్టల నివారణ మందులు, మినరల్ మిక్చర్, గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సినేషన్ వేశారు. కరీంనగర్ పశుగణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ రాఘవ, మండల పశువైద్యాధికారి అజారోద్దీన్ గోపాలమిత్రలు పాల్గొన్నారు.

• యువత సమాజసేవలో పాల్గొనాలి

జ్యోతినగర్: యువత సమాజ సేవలో పాల్గొనాలని ఎన్టీపీసీ ఎస్సై కె.సతీశ్ సూచించారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ జంగాలపల్లెలో సోమవారం రాత్రి కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేశ్ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ కిట్ అందించారు.

• ఇంటింటికీ స్టిక్కర్లు వేయడం పూర్తి

ఎలిగేడు: సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో భాగంగా మంగళవారం మండలంలోని 12గ్రామాల్లో ఇంటింటా స్టిక్కర్లు వేసే కార్యక్రమం పూర్తయినట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు.

• వార్షికోత్సవాలు విజయవంతం చేయండి

సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయ కాలనీలోని గోశాలలో నిర్వహించే గోమాత వార్షికోత్సవాలు విజయవంతం చేయాలని శ్రీధర్మశాస్త్ర ఫౌండేషన్ చైర్మన్ బండారి సూర్య, పూజారి శ్రవణ్ కుమార్ కోరారు. హనుమాన్ ఆలయంలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు గోశాలలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

• పత్తి దిగుమతులు నిషేధించండి

మంథని: కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులు నిషేధించాలని, రైతులకు కనీస మద్దతు ధర చెల్లించేలా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని టీపీసీసీ ఎన్నికల కమిషన్ కోఆర్డినేటర్ కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీకి వరంగల్ సీసీఐ జనరల్ మేనేజర్ అర్జున్ ఎస్.ధవే ద్వారా వినతిపత్రం అందించారు.

• రాష్ట్రస్థాయి లాన్‌టెన్నిస్ పోటీలకు ఎంపిక

ఓదెల: మండలంలోని కనగర్తి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి తాళ్లపల్లి రాజ్‌కుమార్ రాష్ట్రస్థాయి లాన్‌టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మంథనిలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రాజ్‌కుమార్‌ను ఎంఈవో ఎర్ర రమేశ్, పీడీ విష్ణు అభినందించారు.

• అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొనాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు గొల్లపల్లి చంద్రయ్య, పెద్దపెల్లి డివిజన్ నాయకుడు తూళ్ల శంకర్ ఆవిష్కరించారు. ఈనెల 9న ఎన్టీపీసీ ఏరియాలో జరగనున్న అమరవీరుల సంస్మరణ సభలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాజేశ్వర్, రాయమల్లు, పోషం పాల్గొన్నారు.

• 5కె రన్ నిర్వహణ

జూలపల్లి: నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం పెద్దాపూర్ నుంచి జూలపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వరకు 5కె రన్ నిర్వహించారు. మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, నల్ల మనోహర్‌రెడ్డి, ప్రదీప్, రాంగోపాల్‌రెడ్డి, మహేశ్, అనిల్, లాల్ మహ్మద్, నరేశ్ పాల్గొన్నారు.

• మెడికవర్ ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కోల్‌సిటీ: గోదావరిఖని తిలక్‌నగర్‌లో మంగళవారం కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రి వైద్య బృందం సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించారు. ఈ వైద్య శిబిరానికి ఆటో యూనియన్ నుంచి భారీగా ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఎకో వైద్య పరీక్షలు ఆసుపత్రి డాక్టర్ దీక్షిత్ ఉచితంగా నిర్వహించారు.



గోదావరిఖని: ఇటీవల కురిసిన వర్షానికి స్థానిక కళ్యాణ్‌నగర్ రోడ్డుపై నీరు నిలిచి చెరువుగా మారింది. దీంతో ఈరోడ్డుగుండా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డుపై గుంతలు ఉండడంతో వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై నీరు నిల్వకుండా వెంటనే మరమ్మతు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

బదిలీ అధికారికి ఆత్మీయ సన్మానం

రామగిరి: ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహించి పదోన్నతిపై కార్పొరేట్ ఎస్టేట్ జీఎంగా బదిలీపై వెళ్తున్న ఎస్.రాధాకృష్ణను మంగళవారం జీఎం కార్యాలయంలో జీఎం ఎస్.సుధాకర్‌రావు సన్మానించారు. జీఎం మాట్లాడుతూ ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారిగా వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఓసీపీ-1కు నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడం, ఇటీవల జాతీయస్థాయి ఫైవ్ స్టార్ రేటింగ్ పురస్కారం అందుకోవడంలో రాధాకృష్ణ పాత్ర కీలకమన్నారు. ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ఏజీఎం పి.శ్రీనివాసులు, డీజీఎంలు కాశీ విశ్వేశ్వర్‌రావు రాజేంద్రకుమార్, రాజారెడ్డి, ఏరియా సర్వే అధికారి డి.జనార్దన్‌రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఎస్టేట్ అధికారి కె.ఐలయ్య, అధికారులు దూప్‌సింగ్, షబ్బీరుద్దీన్, శ్రీహరి పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఆర్జీ-3 జీఎం ఎస్.సుధాకర్‌రావు

మధుమేహం నియంత్రణలో ఉంచుకోవాలి

గోదావరిఖని: క్రమంతప్పకుండా మందులు వాడుతూ బీపీ, మధుమేహం(షుగర్) నియంత్రణలో ఉంచుకోవాలని సింగరేణి హెల్త్‌ఆఫీసర్ కారం పద్మ సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జీడీకే-2వ గని కార్మికులకు మధుమేహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మధుమేహం వ్యాధి లక్షణాలు గురించి వివరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించడం ద్వారా మధుమేహాన్ని నివారించవచ్చన్నారు. గని మేనేజర్ అల్లాఉద్దీన్, సెక్షన్ ఇన్‌చార్జి టి.శంకర్, సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూసేకరణకు సహకారం అందించాలి

రామగిరి: జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డి.వేణును పెద్దపల్లిలోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి సన్మానం చేశారు. ఆర్జీ-3 ఏరియా బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వారికి తెలియజేశారు. వివిధ గనులలో భూసేకరణకు సంబంధించి సహకారం అందించాలని జీఎం అదనపు కలెక్టర్‌ను కోరారు. ఎస్టేట్ మేనేజర్ కె.ఐలయ్య, అడిషనల్ మేనేజర్ కోల శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



జిల్లా అదనపు కలెక్టర్‌తో జీఎం సుధాకర్‌రావు

అక్రమంగా తరలిస్తున్న రూఫ్‌బోల్టుల పట్టివేత

గోదావరిఖని: అక్రమంగా తరలిస్తున్న సింగరేణి రూఫ్‌బోల్టులను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు జీడీకే-1వ గని సమీపంలో ఆటో ట్రాలీని తనిఖీ చేయగా రూఫ్‌బోల్టులు పట్టుబడినట్లు పేర్కొన్నారు. 300 రూఫ్ బోల్టులను స్వాధీనం చేసుకుని ఆటోను జీఎం కార్యాలయానికి తరలించామన్నారు. పట్టుకున్న స్క్రాప్ విలువ రూ.1.25లక్షలు ఉంటుందని తెలిపారు. జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్, చందా శ్రీనివాస్, జమేదార్ చంద్రగౌడ్, సెక్యూరిటీ సిబ్బంది శ్రీనివాస్, అలీ, ఇంటెలిజెన్స్ టీం ఉన్నారు. రూఫ్‌బోల్టులను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బందిని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అభినందించారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న ఆటో ట్రాలీ

సింగరేణికి రావాల్సిన బకాయిలు చెల్లించాలి

గోదావరిఖని: ప్రయివేటీకరణ నుంచి సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు అధికారులు, కార్మికులు నడుం బిగించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. జీడీకే-5 ఓసీపీలో మంగళవారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా సింగరేణి సంస్థ మనుగడను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సింగరేణికి రావాల్సిన రూ.34కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యంతో అధికారులు విచ్చలవిడిగా సంస్థ సొమ్మును అభివృద్ధి పేరుతో ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేయడం సరైంది కాదన్నారు. రాజకీయ జోక్యంతో అధికారులు పనిచేస్తే సంస్థ అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, జీగురు రవీందర్, ప్రభుదాస్, మహేశ్, అశోక్ పాల్గొన్నారు. పలువురు యూనియన్‌లో చేరగా వారికి సీతారామయ్య కండువా కప్పి ఆహ్వానించారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

షీటీంపై అవగాహన

రామగుండం: పట్టణంలోని ఐటీఐ చుక్కా రామయ్య హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం షీటీంపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత, సైబర్ క్రైమ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. షీటీం సభ్యురాలు స్నేహలత, హైస్కూల్ చైర్మన్ ప్రసాద్, హెచ్‌ఎం భాస్కర్ పాల్గొన్నారు.